సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



## భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయంపై అమావాస్య ఎఫెక్ట్ పడింది. నిత్యం రద్దీగా ఉండే ఆలయ పరిసరాలు శనివారం నామమాత్రపు భక్తులతో దర్శనమిచ్చాయి.



## పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. విశేష అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు.



## మంత్రిని కలిసిన ఆర్.నారాయణమూర్తి

తణుకు అర్బన్: తణుకులో మంత్రి కారుమూరి నాగేశ్వరరావును సినీ నటుడు, రచయిత ఆర్.నారాయణమూర్తి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

## న్యూస్‌రీల్

### నేటి నుంచి శరన్నవరాత్రులు



పార్వతీ దేవి అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడిలోని పంచారామ క్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)లో ఆదివారం నుంచి ఈనెల 23 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.రామకృష్ణంరాజు తెలిపారు. అమ్మవారికి తొలిరోజు మహాలక్ష్మీదేవి, 16న బాలాత్రిపుర సుందరి దేవి, 17న గాయత్రీ దేవి, 18న లలితా త్రిపుర సుందరీ దేవి, 19న అన్నపూర్ణాదేవి, 20న సరస్వతీ దేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసుర మర్దినీ దేవి, 23న రాజరాజేశ్వరి దేవి అలంకరణలు చేస్తామని తెలిపారు.

### ఎస్ఆర్‌కేఆర్‌కు బెస్ట్ అవార్డు



కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వ ఉన్నత భారత్ అభియాన్ (యూబీఏ)లో భాగంగా దత్తత గ్రామాల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల అందిస్తున్న సాంకేతిక ప్రగతికి ఆంధ్ర యూనివర్సిటీ బెస్ట్ అవార్డు ప్రదానం చేసిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ తెలిపారు. శనివారం కళాశాలలో ఆయన వివరాలు వెల్లడించారు. యూబీఏ నిర్వహణలో కృషికి వెబ్ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ టి.రాంబాబుకు బెస్ట్ కో–ఆర్డినేటర్ అవార్డు కూడా లభించిందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు తమ ఇంజనీరింగ్ కళాశాల కాళ్ల మండలంలోని పెద అమిరం, కోపల్లె, జక్కరం, కాళ్ల, కాళ్లకూరు గ్రామాలను దత్తత తీసుకుని పలు కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, రాంబాబును సత్కరించారు. ఆర్అండ్‌డీ డీన్, యుబీఏ సెల్ కో–ఆర్డినేటర్ పీఏ రామకృష్ణంరాజు, ఆర్.సుబ్బారావు, జి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోడౌన్ పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ప్రశాంతి శనివారం పరిశీలించారు. అధికారులకు సూచనలిచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్‌ఓ కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్యామల, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, ఎన్నికల సూపరింటెండెంట్ ఎల్.నరసింహారావు, ఎన్నికల సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

# సెల్ఫీ విత్ టాపర్స్

**ప్రోత్సాహం.. స్ఫూర్తిమంతం**

- విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేలా..
- నూతనోత్సాహం పెల్లుబికేలా..
- వినూత్నంగా సెల్ఫీ కార్యక్రమం అమలు
- ప్రభుత్వ బడుల విద్యార్థులకు ప్రేరణ



పాఠశాలలో టాపర్స్‌తో సెల్ఫీ దిగుతున్న ఏలూరు డీఈఓ శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. రాష్ట్రంలో చదువుల విప్లవానికి శ్రీకారం చుట్టారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యారంగంలో పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారు. మనబడి నాడు–నేడులో కార్పొరేట్ తరహాలో సర్కారీ బడులను తీర్చిదిద్దారు. అలాగే విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వారిలో పోటీతత్వాన్ని పెంచేలా 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నగదు బహుమతులు అందిస్తున్నారు. ఇదే కోవలో ఇప్పుడు సెల్ఫీ విత్ టాపర్స్ అనే వినూత్న కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు.

**విజయాలకు గుర్తుగా..**

సాధారణంగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, సినీ ప్రముఖులు, క్రీడాకారులతో సెల్ఫీలు దిగడానికి పోటీలు పడటం చూస్తుంటాం. పేరు, ప్రఖ్యాతులు కలిగిన ప్రముఖులను కలిశామనే తీపి గుర్తును పదికాలాల పాటు దాచుకోవడానికి ఇటువంటివి జరుగుతుంటాయి. ఆ కోవలోనే విద్యార్థులు కూడా తాము సాధించిన విజయాలు వారికి తీపిగుర్తులుగా ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం సెల్ఫీ విత్ టాపర్స్ అనే కార్యక్రమం ప్రారంభించింది. అయితే ఇక్కడ మాత్రం విజయాలు సాధించిన విద్యార్థులతో ప్రముఖులే సెల్ఫీలు దిగడం ప్రత్యేకత.

**ఎఫ్ఏ–2 పరీక్షల నుంచే అమలు**

సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం ఎఫ్ఏ–2 పరీక్షల నుంచే అమలుచేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకూ నిర్వహించిన ఈ పరీక్షల్లో పాఠశాల స్థాయిలో టాపర్ల ఎంపిక ప్రక్రియను ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఈ పరీక్షలకు సంబంధించి సబ్జెక్టు టీచర్లు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థులు సాధించిన మార్కులను వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. ఇలా పాఠశాల స్థాయిలో ప్రతి తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించారు. అలా గుర్తించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సెల్ఫీలు దిగుతూ వారిని ప్రోత్సహిస్తున్నారు.

**తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా..**

సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం కేవలం టాపర్లను ప్రోత్సహించడమే కాకుండా తోటి విద్యార్థుల్లోనూ స్ఫూర్తి నింపుతోంది. టాపర్ల స్థానాల్లో తాము ఎందుకు ఉండకూడదు అనే ఆలోచనను మిగిలిన విద్యార్థుల్లో రేకెత్తిస్తోంది. రానున్న పరీక్షల్లో వారి కన్నా ఎక్కువ మార్కులు సాధించి తాము టాపర్లుగా నిలవాలనే కసిని పెంపొందిస్తోంది. ఈ ప్రభావం సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై పడి వారు సైతం ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రోత్సాహకరంగా నిలుస్తోంది.

| పాఠశాలలు | ఏలూరు జిల్లా | పశ్చిమ గోదావరి |
|---|---|---|
| ప్రాథమిక | 1,346 | 1,062 |
| ప్రాథమికోన్నత | 199 | 83 |
| ఉన్నత | 262 | 207 |
| విద్యార్థులు | 1,47,730 | 1,08,606 |




పశ్చిమగోదావరి జిల్లాలో విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న టీచర్

**తీపిగుర్తుగా..**

ప్రముఖులే వచ్చి తమతో సెల్ఫీలు దిగడం అనే భావన విద్యార్థులను గర్వపడేలా చేస్తోంది. పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన తమతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తమ తోటి మిత్రుల సమక్షంలో సెల్ఫీలు దిగడం వారికి తీపిగుర్తుగా మిగిలిపోనుంది. అలాగే విజయాలు సాధించిన విద్యార్థులు తమ స్థానాలను కాపాడుకోవడానికి, ఇతర విద్యార్థులు తాము ఆ ఘనత సాధించడానికి ఇటువంటి కార్యక్రమం స్ఫూర్తిగా నిలుస్తోంది.


### అందరూ భాగస్వాములు కావాలి



సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం అత్యుత్తమమైన అద్భుత ఆలోచన. సర్కారీ బడుల్లో విద్యార్థులు ఎందులోనూ తక్కువ కాదని నిరూపించడానికి ఇదో చక్కటి వేదిక. సెల్ఫీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై విద్యార్థులను ప్రోత్సహించాలి. టాపర్స్‌కు దక్కుతున్న గౌరవం తాముా దక్కించుకోవాలనే కాంక్ష ఇతర విద్యార్థుల్లో సైతం కలగాలి. అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యపడతాయి.

– తోట ఎడ్వర్డ్, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు

### ప్రామాణికంగా ప్రభుత్వ విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలతో అందుతున్న విద్య విద్యార్థుల్లో ఎంతటి ప్రోత్సాహం నింపుతుందో సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం నిరూపించనుంది. ఇది ఇతరులకు ప్రామాణికంగా నిలవనుంది. ప్రతి పాఠశాలలో సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలిచ్చాం. ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలను విద్యార్థులు అందుకుంటూ అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ ఆశయాన్ని ముందుకు తీసుకువెళ్లాలి.

– పి.శ్యామ్‌సుందర్, జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు

## 16 నుంచి ఈవీఎంల తనిఖీ

**కలెక్టర్ ప్రశాంతి**



మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఈనెల 16 నుంచి 40 రోజులపాటు ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ మొదటి దశ తనిఖీ ప్రక్రియ నిర్వహించనున్నామని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం భీమవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తనిఖీ ప్రక్రియకు పక్కాగా ఏర్పాట్లు చేశామని, రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు తనిఖీ చేస్తామని, ఈ మేరకు 24 టేబుళ్లు ఏర్పాటుచేస్తామన్నారు. ఆయా టేబుళ్లలో డీటీ, పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్‌ను ఉంచుతామన్నారు. బెల్ కంపెనీ నుంచి 12 మంది ఇంజనీర్లు వస్తారని వారి ఆధ్వర్యంలో తనిఖీ ప్రక్రియ జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులకు గుర్తింపు కార్డులను ఇస్తామని, ఈవీఎం గోడౌన్‌లోకి సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. ఈవీఎంలతో మాక్ పోలింగ్ కూడా నిర్వహిస్తామన్నారు. పనితీరు సక్రమంగా ఉన్న వాటికి ప్రతినిధులు అందరూ సంతకం చేసి ఇచ్చిన పేపర్‌ను ఉంచి ఈవీఎంలను సీల్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), మరపట్ల శ్యాంబాబు (టీడీపీ), టి.వంశీ శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే లక్ష్యంగా ఆరోగ్య సురక్ష

**డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ**



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ప్రజల సంతృప్తే లక్ష్యంగా, ప్రత్యేక హక్కుగా జగనన్న ఆరోగ్య సురక్ష నిలుస్తుందని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ స్కూల్ ప్రాంగణంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలగల నాగసూర్యకుమారి ఆడిటోరియంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ, జనసేన పార్టీలకు పేదలంటే చిన్నచూపు అని, పవన్ కల్యాణ్ యువతను రెచ్చగొడితే, టీడీపీ నాయకులు చంద్రబాబు కోసం ప్రదర్శనలు, నిరాహారదీక్షలు అంటూ ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. అయితే ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా సీఎం జగన్ రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, 104, 108, ఫ్యామిలీ ఫిజీషియన్ వంటి సేవలతో పాటు గ్రామస్థాయిలోనే అత్యాధునిక వైద్య సేవల కోసం ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఇంటింటా ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారన్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమంతో వైద్యం పూర్తిగా ప్రజల హక్కుగా జగనన్న చేశారన్నారు. మెగా శిబిరంలో 50 మంది ప్రత్యేక వైద్యులు సేవలందించారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వారికి ఆరోగ్య పరీక్షలు చేసి వైద్య సిబ్బంది మందులు అందజేశారు. యువనేత కొట్టు విశాల్, జిల్లా, మండల వ్యవసాయసలహా మండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఆర్డీఓ చెన్నయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీపీ దాసరి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఎస్సై పరీక్షలు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



అభ్యర్థి కాలు కట్టును పరిశీలిస్తున్న సిబ్బంది

**తొలిరోజు 4,110 మంది హాజరు**

ఏలూరు టౌన్: ఏలూరులో ఎస్సై మెయిన్స్ పరీక్షలు తొలిరోజు ఆదివారం ఐదు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐదు జిల్లాలకు చెందిన అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ మేరకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచే కేంద్రాల వద్దకు అభ్యర్థులు చేరుకున్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత అధికారులు కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు 4,162 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా ఉదయం 4,110 మంది, మధ్యాహ్నం 4,109 మంది హాజరయ్యారు. పరీక్షల దృష్ట్యా నగరంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ స్వయంగా పరీక్షా కేంద్రాలన్నీ తనిఖీ చేశారు. ఆయనతోపాటు ఏలూరు, కృష్ణా, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఎస్పీలు డి.మేరీ ప్రశాంతి, జాషువా, శ్రీధర్, ఏలూరు అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు కేంద్రాలను తనిఖీ చేశారు.

**తొలిరోజు ప్రశాంతం: డీఐజీ అశోక్‌కుమార్**



ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన ఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా మెయిన్స్ పరీక్షలు సజావుగా సాగేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతించామని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచీలు వంటివి అనుమతించలేదన్నారు. ఆదివారం రెండో రోజు పరీక్షలు జరుగనున్నాయని, తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.



ఏలూరు సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

## ● నవరాత్రి శోభ.. దుర్గమ్మ ప్రభ





శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి దసరా వేడుకలు ప్రారంభం కానున్నాయి. అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్నాయి. మండపాల్లో కొలువు దీరేందుకు అమ్మవారి విగ్రహాలు ముస్తాబయ్యాయి. ద్వారకాతిరుమలలో కాంతులీనుతున్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మ ఆలయం, భీమడోలు మండలం గుండుగొలనులో కొలువుదీరేందుకు ముస్తాబైన దుర్గమ్మ విగ్రహ దృశ్యాలివి. - ద్వారకాతిరుమల/భీమడోలు

# సాగునీటి సమస్యకు పరిష్కారం

గణపవరం: మండలంలోని అర్ధవరం, వరదరాజపురం, కొత్తపల్లి, సరిపల్లె రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మాథూర్ శనివారం పరిశీలించి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆయా గ్రామాల రైతులు రైతుకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో భీమవరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి సమస్యలు తీసుకువెళ్లారు. పొలాలకు సాగునీరు అరకొరగా అందుతుందని, తోడుకోవడానికి నీరుండటం లేదని, కాలువలో నీటిని ఆక్వా చెరువులకు అక్రమంగా తోడేస్తున్నారని, ఆక్వా చెరువుల్లోని కలుషిత నీరు పంట కాలువలోకి వదలడంతో తమ చేలు దెబ్బతింటున్నాయని స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మాథూర్ ఈ ప్రాంతానికి వచ్చి రైతులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు. దీనిపై రైతు కార్యాచరణ సమితి నాయకులు పి.గోపాలకృష్ణంరాజు, ఆర్‌వీఎస్ రాజు, కంతేటి కృష్ణంరాజు, ఆర్.సత్యనారాయణరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

తణుకు టౌన్: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పనిచేసే నాల్గో తరగతి ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నేలపాటి మధు తెలిపారు. శనివారం తణుకులోని ఎస్సీ బాలికల వసతి గృహంలో సమావేశం నిర్వహించామన్నారు. సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చీకటిమిల్లి మంగరాజు, అధ్యక్షురాలిగా రావి చంద్రకళ, ఉపాధ్యక్షులుగా డి.ప్రసాద్, కె.రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేలపాటి మధు, ప్రదాన కార్యదర్శిగా దాసి అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శిగా ఎల్.జయప్రద, రాజీవ్, కోశాధికారిగా ఎస్.విజయకుమారి, కార్యవర్గ సభ్యులుగా వి.శ్రీనివాసరెడ్డి, పి.సరోజిని, ఎం.వెంకటేశ్వరరావు, ఎ.మరియమ్మ, పి.రాజేష్, కె.రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు. ముఖ్య అతిథిగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి పాల్గొన్నారు.

# దసరా సందడి షురూ

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- హైదరాబాద్ నుంచి జిల్లాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



**భీమవరం (ప్రకాశం చౌక్):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే దసరా ఉత్సవాలకు పట్టణాలు, గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో, ప్రత్యేక వేదికల వద్ద మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాల వద్ద చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ, క్యూలైన్లు ఏర్పాటు చేశారు.జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆలయాల్లో కొలువైన అమ్మవార్లకు దసరా పండగను పురస్కరించుకుని 9 రోజుల పాటు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహిస్తారు. జిల్లాలోని ప్రముఖ దేవస్థానాలైన భీమవరం మావుళ్లమ్మ అమ్మవారు, కొలేర్లు పెద్దింట్లమ్మ తల్లి, దువ్వ దానేశ్వరి అమ్మవారు, భీమవరం పంచారామక్షేత్రం శ్రీపార్వతిదేవి, అన్నపూర్ణదేవి, పాలకొల్లు పంచారామక్షేత్రం పార్వతిదేవి, పెనుగొండ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి, తాడేపల్లిగూడెం బలుసులమ్మ అమ్మవార్లకు తొమ్మిది రోజుల పాటు రోజుకొక అలంకరణ చేస్తారు. అలాగే గ్రామాల్లో పలు గ్రామ దేవతలకు అమ్మవార్ల అలంకరణలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరుపుతారు.

**మావుళ్లమ్మ ఆలయంలో..**

రాష్ట్రంలోనే ప్రముఖ ఆలయం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 15 తేదీ నుంచి 23వ తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. 15న బాలాత్రిపుర సుందరీదేవి, 16న అన్నపూర్ణాదేవి, 17న గాయత్రీ దేవి, 18న మహాలక్ష్మిదేవి, 19న లలితా త్రిపుర సుందరీదేవి, 20న సరస్వతీ దేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసుర మర్దనీ దేవి, 23న రాజరాజేశ్వరీ దేవిగా అలంకరిస్తారు.

**18 నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు**

దసరా పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ఈ నెల 18 నుంచి హైదరాబాద్ నుంచి జిల్లాలోని నాలుగు డిపోలకు 35 ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. పండుగ అనంతరం 29వ తేదీ వరకు జిల్లా నుంచి హైదరాబాద్‌కు 25 సర్వీసులు కేటాయించారు. భీమవరం నుంచి 15, నర్సాపురం 13, తణుకు 20, తాడేపల్లిగూడెం నుంచి 25 బస్సులు తిప్పనున్నారు. సూపర్ లగ్జరీ టికెట్ ధర రూ.720, అల్ట్రా డీలక్స్ రూ.690 సాధారణ ధరలకే సర్వీసు నడుపుతున్నారు. అలాగే ఆన్‌లైన్, బస్టాండ్‌లోని కౌంటర్ల ద్వారా రిజర్వేషన్లు చేసుకోవచ్చును.

**సాధారణ టికెట్ ధరకే..**



దసరా పండుగకు ఆర్టీసీ ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక బస్సులను ఉపయోగించుకోవాలి. 18వ తేదీ నుంచి హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. పండుగ అనంతరం కూడా జిల్లాలోని నాలుగు డిపోల నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు ఉంటాయి. సాధారణ టికెట్ ధరకే ఈ సర్వీసులు ఉంటాయి. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఒకేసారి వెళ్లి రావడానికి రిజర్వేషన్ వల్ల 20 శాతం రాయితీ కూడా టికెట్ ధరలో లభిస్తుంది.

– ఎం.వీరయ్య చౌదరి, ప్రజా రవాణాధికారి, భీమవరం

## భర్త ఇంటి ఎదుట నిరసన



భర్త ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న ఫాతిమా బేగమ్

**ఉంగుటూరు:** చేబ్రోలులో భర్త ఇంటి ఎదుట ఓ వివాహిత ఆందోళన చేపట్టింది. వివరాలిలా ఉన్నాయి. హిందు మహిళగా ఉన్న తాను ఎస్‌కే ఫాతిమా బేగమ్‌గా పేరు మార్చుకుని సాహెబ్ అనే వ్యక్తిని 1988లో పెళ్లి చేసుకున్నానని, తనకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని తెలిపింది. అయితే తన భర్త ఇప్పుడు మరో యువతిని వివాహం చేసుకుని తనను ఇంటి నుంచి బయటకు గెంటివేశాడని ఆరోపించింది. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్నట్లు తెలిపింది. ఈ విషయంపై ఎస్సై స్వామిని వివరణ కోరగా, బాధితురాలు స్టేషన్‌కు వచ్చి వెళ్లారని, ఇంకా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

















## శ్రీవారి నైవేద్యానికి 'ప్రకృతి' బియ్యం



శ్రీవారి నైవేద్యానికి పంపిస్తున్న ప్రకృతి వ్యవసాయ ధాన్యం

**తాడేపల్లిగూడెం:** తిరుమలలో శ్రీవారి నైవేద్యం నిమిత్తం వేదభారత్ ఫౌండేషన్ సంస్థ ఎనిమిది టన్నుల ధాన్యాన్ని శనివారం టీటీడీకి తాడేపల్లిగూడెం నుంచి పంపించింది. హైదరాబాద్ కేంద్రంగా ప్రకృతి వ్యవసాయ సేద్యాన్ని నిర్వహిస్తున్న వేదభారత్ ఫుడ్ ప్రొడెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సేవ్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కొయ్యలగూడెంకు చెందిన నిడదవోలు రామారావు చెప్పారు. గో ఆధారిత వ్యవసాయం ద్వారా 20 రకాల దేశీయ వరి విత్తనాలైన బహురూపి, చింతలూరి సన్నాలు, ఇంద్రయాని మొదలైన రకాలు పండించి అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఈ సంస్థ స్వామివారికి నైవేద్యం నిమిత్తం టీటీడీకి ప్రకృతి ఆధారిత ధాన్యం పంపించడానికి సంప్రదించగా టీటీడీ అంగీకారం తెలిపిందన్నారు. అప్పటి నుంచి 15సార్లు ఈ ధాన్యం అందించినట్లు సంస్థ ప్రతినిధి వినయ్ రామ్ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కేంద్రంగా కొయ్యలగూడెం, ఉండ్రాజవరం, పెంటపాడు, తణుకు, అల్లూరి జిల్లా రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాలలో వెయ్యి ఎకరాలకు పైగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామన్నారు.

## రగ్బీ రాష్ట్ర పోటీలకు ఏడుగురి ఎంపిక



స్టేట్ రగ్బీ పోటీలకు ఎంపికైన పెనుగొండ విద్యార్థులు

**పెనుగొండ:** తూర్పుతాళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రగ్బీ అండర్–14, –17 పోటీల్లో పెనుగొండ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని పీఈటీ దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పెనుగొండ మాస్టర్ మైండ్స్ నుంచి వీరందరూ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఎ.మహిమేఘన, కె.జీవంత్, కె.బద్రీ, ఈ.ధనదీపిక, యు.సుదర్శిని, వి.అక్షయ జెస్సీ, వి.రిషి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను సెక్రటరీ కరస్పాండెంట్ జక్కం విజయకుమార్, ప్రిన్సిపాల్ ఎస్.మురళీ మోహన్‌రావు అభినందించారు.

## ఏజెంట్‌పై కేసు నమోదు

**ద్వారకాతిరుమల:** ఎటువంటి లైసెన్స్ లేకుండా మాయమాటలు చెప్పి ఓ మహిళను మస్కట్‌కు పంపిన ఏజెంట్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగ్రకుంటకు చెందిన నరెడ్ల సుబ్బారావు భార్య నిర్మలను మూడు నెలల క్రితం పాలకొల్లుకు చెందిన కిషోర్ అనే ఏజెంట్ మస్కట్‌కు పంపాడు. అయితే తన భార్యను అక్కడ చిత్రహింసలకు గురిచేస్తున్నారని, ఎటువంటి లైసెన్స్ లేకుండా తన భార్యను కిషోర్ అక్కడకు పంపడం వల్లే ఇలా జరిగిందని సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద మృతి



సుహాస్ (ఫైల్)

**నరసాపురం రూరల్:** కొత్తనవరసపురం గ్రామ సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. భీమవరానికి చెందిన జక్కం కుమార్ వెంకటసాయి సుహాస్ (28) కొత్తనవరసపురంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా సెలవులో ఉన్నాడు. తండ్రితో చెప్పి శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి అతని ఫోన్ పని చేయలేదు. అయితే పేరుపాలెం బీచ్ వేళంకిణి మాత ఆలయ సమీపంలోని కొబ్బరితోటలో శనివారం ఉదయం శవమై కనిపించాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శ్రీనివాసయాదవ్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యా లేక మరేదైనా కారణమా అనే కోణంలో విచారణ చేస్తున్నామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.







## క్లుప్తంగా

### క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మనోజ్ బాబు

**తణుకు టౌన్:** రాష్ట్రంలో అన్ని మతాలకు మత స్వేచ్ఛ, రక్షణకు సంబంధించి దాడుల నివారణకు దిశా యాప్ మాదిరిగా ఒక యాప్‌ను రూపొందించి రక్షణ కల్పించాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఓ మనోజ్ బాబు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి కలసి వినతి పత్రం అందజేశారు. చర్చిల నిర్మాణానికి పంచాయతీ, లేక మున్సిపాలిటీల నుంచి అనుమతులు ఇప్పించాలని, క్రిస్మస్, మహా సభలు నిర్వహించుకునేందుకు ఉన్నత పాఠశాలల ఆవరణలకు అనుమతులు ఇవ్వక పోగా అనుమతులు ఇచ్చిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం బాధకలిగిస్తుందని ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలం స్పందించినట్లు మనోజ్ బాబు తెలిపారు.

### దసరా వేడుకలకు దేవాలయాల ముస్తాబు



దసరా వేడుకల కోసం ముస్తాబైన దువ్వ దానేశ్వరి అమ్మవారి ఆలయం

**తణుకు టౌన్:** శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా తణుకు మండలంలోని పలు దేవాలయాలు విద్యుత్ దీపాలతో వెలుగులతో ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఈనెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ జరిగే దసరా వేడుకలకు మండలంలోని దువ్వ గ్రామంలో వేంచేసియున్న శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయం, మండపాక గ్రామంలోని శ్రీ యల్లారమ్మ వారి ఆలయం, తణుకు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలు దసరా ఉత్సవాల కోసం రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని ప్రముఖ ఆలయాలతో పాటు వివిధ గ్రామాల్లో భవానీ మాల దీక్షాదారులు కూడా ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేశారు.

### వరాల వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



అత్తిలి మండలం ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

**అత్తిలి:** ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామివారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలు సేవ నిర్వహించారు.ఉదయం అర్చనలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

### బీకేఎంయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన అనంతపురంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కలిశెట్టి వెంకట్రావు, కళింగ లక్ష్మణరావులు వెల్లడించారు. సదస్సుకు ప్రధాన ఉపన్యాసకులుగా సీపీఐ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ కామ్రేడ్ బినయ్ విశ్వమ్, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సంఘం గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్, అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు పాల్గొంటారని వెల్లడించారు.

### హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** దసరా పండుగ సెలవులు సందర్భంగా ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాడేపల్లిగూడెం డిపో నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ప్రత్యేక బస్సు సర్వీసులకు సాధారణ టికెట్ చార్జీలు మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు. రానుపోను టికెట్ ఒక్కసారి తీసుకుంటే 10 శాతం రాయితీ కూడా అందిస్తోందని చెప్పారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం, సుఖవంతమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇచ్చే తగ్గింపు రేట్లును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

**తాడేపల్లిగూడెం రూరల్:** శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారి ఆలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు రాష్ట దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులచే శ్రీముత్యాలమ్మ వారి మృత్తిక విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్ తెలపారు. అమ్మవారు రజిత కవచ ముత్యాలమ్మగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా మాకా శేషగిరిరావు- అనసూయ దంపతులు సహస్రనామ కుంకుమ పూజ, గరగ సతీష్ - జ్యోతి దంపతులచే చండీ పారాయణ, పుష్పార్చన, సహస్ర కుంకుమ పూజలు జరగనున్నాయి. సోమవారం ముత్యాలమ్మ వారిని శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించనున్నట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఆరుగొలనులో...:**
మండలంలోని ఆరుగొలను గ్రామంలో వేంచేసియున్న శ్రీవిజయదుర్గమ్మ వారి ఆలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ తెలిపారు. ఉదయం 8.15 గంటలకు కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా అమ్మవారు స్వర్ణ కవచాలంకృత కనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 16వ తేదిన గాయత్రీ దేవిగా అమ్మవారిని అలంకరించనున్నట్టు ఆలయ కమిటీ వారు తెలిపారు.



ముత్యాలంబాపురం ముత్యాలమ్మవారు



బలుసులమ్మ అమ్మవారు



వాసవి అమ్మవారు

**బలుసులమ్మ ఆలయంలో...**
**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో నేటి నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయంలో 15వతేదీన ఉదయం గోపూజ, అమ్మవారి కలశ స్థాపన, పూజా కార్యక్రమాలు జరుగుతాయి. బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరణ, 16వ తేదీ సోమవారం గాయత్రిదేవిగాను, 17వ తేదీన మంగళవారం అన్నపూర్ణ దేవిగాను, 18వ తేదీ బుధవారం మహాలక్ష్మిదేవిగాను, 19వ తేదీ గురువారం మహాచండిదేవిగాను, 20వ తేదీ శుక్రవారం సరస్వతి దేవిగాను, 21వ తేదీ శనివారం లలిత త్రిపుర సుందరీ దేవిగాను, 22వ తేదీ ఆదివారం దుర్గాదేవిగాను, 23వ తేదీ సోమవారం మహిషాసుర మర్దినీ దేవిగాను, అదే రోజు సాయంత్రం రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. కార్యనిర్వహణాధికారి ఎ.రవిశంకర్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు పర్యవేక్షణలో వెలవలపల్లి ప్రదీప్ శర్మ, గోపీనాథ్ శర్మ, బాధంపూడి మల్లిఖార్జున శర్మలు బ్రహ్మత్వాలు నిర్వహించనున్నారు.

**వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో...**
**తణుకు అర్బన్:** శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తణుకు శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల ఆలయంలో వేంచేసియున్న శ్రీకామాక్షిదేవికి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పొడుగు రామాచారి, ఆలయ కమిటీ తెలిపారు. ఆదివారం ఉదయం 8.49 గంటలకు ఆలయంలో కలశస్థాపనతో దేవీ నవరాత్రి మహోత్సవాలు ప్రారంభిస్తున్నామని, 10వ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారిని నవరాత్రుల్లో ప్రతిరోజూ ఒక అవతారం చొప్పున 9 రోజులపాటు విశేష అలంకరణలు చేయనున్నట్లు వివరించారు. భక్తులంతా పూజాధికాల్లో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించాలని కోరారు.

**నేటి నుంచి శ్రీ వాసవిలో దసరా మహోత్సవాలు**
**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో శ్రీ వాసవి కన్యకపరమేశ్వరీ ఆలయంలో దసరా మహోత్సవాలు ప్రారంభమైనట్లు వాసవి ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఆలయంలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశంలో వక్తలు గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. 15వ తేదీ నుంచి 25 వరకు ఆలయంలో అమ్మవారి కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశేష అలంకరణలతో పాటు హోమాలు, జ్యోతిర్లింగార్చనలు, యంత్రార్చనలు, పూలంగి సేవ తదితర విశేష కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఒబిలిశెట్టి నటరాజ్, నున్న బాల త్రిపుర సుందరరావు, మండవల్లి చెన్నా నాగేంద్ర, ఆలపాటి కృష్ణకుమార్, బ్రహ్మజీ, శ్యామ్ కుమార్ గుప్తా, కార్యవర్గ సభ్యులు తెలిపారు.

# జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యానికి రక్ష

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

**పెంటపాడు:** పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్‌స్కూలు ప్రాంగణంలో శనివారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో పలు గ్రామాల నుంచి రోగులు ఈ శిబిరంలో ప్రత్యేక వైద్యుల సూచనల మేరకు ఎంతో విలువైన ఎక్సరేలు, ఈసీజీ, ఆల్ట్రా సౌండ్ స్కానింగ్, పాప్‌స్మియర్ పరీక్షలు చేయించుకొన్నారు, ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలగల నాగసూర్యకుమారి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. శిబిరంలో ఆరోగ్య సేవలను ఆయన పరిశీలించి వైద్యులకు సూచనలిచ్చారు. శిబిరంలో సేవలపై ప్రజలను ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో యువనేత కొట్టు విశాల్, ఆర్డీవో చెన్నయ్య, మండల వ్యవసాయసలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీపీ దాసరి హైమావతి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ముప్పిడి సంపత్‌కుమార్, విజయవాడ కనకదుర్గమ్మ ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్ధనరావు, కోసూరి వెంకట్రాజు, నల్లమిల్లి గాంధీరెడ్డి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, గుండుమోగుల సాంబయ్య, నల్లమిల్లి అంజిరెడ్డి, మైలవరపు పెదబాబు, కర్రి వరహాలరెడ్డి, యూత్ అధ్యక్షులు కొవ్వూరి బాస్కరరెడ్డి, ఎంపీడీవో బాలాజీ, పీహెచ్‌సీ డాక్టర్లు ఎస్వీరమణ, తోట రాజేష్, పూజిత, మౌనిక, ఆయా గ్రామాల ఆరోగ్యశాఖ సిబ్బంది, పలు ప్రాంతాల నుండి వచ్చిన వైద్యసిబ్బంది, పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాగిజావను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

# ప్రతి గడపకూ సంక్షేమమే ధ్యేయం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- రాపాకలో గడపగడపకు మన ప్రభుత్వం



రాపాకలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

**ఇరగవరం:** ప్రతి గడపకూ సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇరగవరం మండలం రాపాక గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు మీకు అందుతున్నాయా లేదా అని ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కుల, మతాలకు, పార్టీలతో సంబంధం లేకుండా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడం గొప్ప విషయమన్నారు. ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా నిలవాలని కోరారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి పేదోడికి సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు చేసేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని, ప్రజలంతా మరోసారి అండగా నిలవాలని ఆయన కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రజలు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కెనాల్ రోడ్డు, రాపాక, సూరంపూడి రోడ్డు నిర్మాణాలను ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ అలివేలు మంగ తాయారు, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గ ప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు ,సర్పంచ్ బృందావనం గోపాల కృష్ణ మూర్తి, సొసైటి అధ్యక్షుడు చిట్నీడి రమేష్, కొక్కిరాల రాజారావు, దొరబాబు, కార్యదర్శి ప్రసాద్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మునుపెన్నడూ చూడని సంక్షేమం, అభివృద్ధి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

**తణుకు అర్బన్:** రాష్ట్రంలో మునుపెన్నడూ చూడని సంక్షేమం, అభివృద్ధి అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు బాలగంగాధర తిలక్ మున్సిపల్ ఆడిటోరియంలో శనివారం తణుకు మండలం దువ్వగ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు మంచి చేయాలనే తపనతోనే అర్హులందరికీ జగనన్న ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు అందుతున్న సంక్షేమాన్ని మిగిలిన రాష్ట్రాలు సైతం ఆలోచించే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండేళ్లపాటు కోవిడ్ విజృంభించి దేశంలో మృత్యుఘంటికలు మోగించినా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం వలంటీరు వ్యవస్థతో ప్రజలందరినీ కాపాడుకున్నామని గుర్తు చేశారు. రైతాంగానికి మంచి చేయాలనే ఉద్దేశ్యంతో మట్టి పరీక్ష కేంద్రాలను ఆర్బీకే సెంటర్‌లలో ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. దీనివలన రైతాంగానికి కొంతమేర పెట్టుబడి తగ్గే వెసులుబాటు ఉంటుందని అన్నారు.



తణుకులో దువ్వ గ్రామ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

**గత ప్రభుత్వ హయాంలో దోచుకో.. దాచుకో..**
గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రజా ధనాన్ని దోచుకో దాచుకో అనే రీతిలో వ్యవహరించి ఇప్పుడు జైలుకెళ్లారని విమర్శించారు. ప్రజా ధనాన్ని దోచుకుని జైలు కెళ్తే టీడీపీ నేతలు సానుభూతి పొందాలనే ఉద్దేశ్యంతో నిరసన దీక్షలు, ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రజలపక్షాన పోరాడుతున్నారనే జైలులో పెట్టారని చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా రానున్న రోజుల్లో పార్టీకోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, గ్రామ అధ్యక్షుడు శిరిగిశెట్టి గోపాలకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు జంపన కృష్ణంరాజు, ఎంపీపీ రుద్ర ధనరాజు, రైతువిభాగ మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, ఉప సర్పంచ్ వీరబాబు, పార్టీ నాయకులు కరుటూరి సర్వేశ్వరరావు, వార్డు మెంబర్లు, దేవస్థానం చైర్మన్‌లు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలను తగ్గించాలి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వామపక్ష నాయకులు శనివారం గూడెంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 9వ తేదీ నుంచి 14 వరకు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు వెల్లడించారు. 15వ తేదీన విద్యుత్ చార్జీలపై ఆర్డీసీ వద్ద విద్యుత్ వ్యతిరేక విధనాలపై ఓటింగ్ జరుగుతుందని, ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాస్యం రాము, బి.కృష్ణ, రావూరి బేబి, కిలాడీ రవి, లుక్కా సుబ్బారావులు పాల్గొన్నారు.

**సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు:**
సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ శేష మహల్ సెంటర్‌లో శనివారం నిరసన ప్రదర్శన జరిగింది. మామిడి దానవర ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేయవద్దని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బి.ఉదయరాజు, బాలసుబ్రహ్మణ్యం, దుర్గా ప్రసాద్, అసిన్ బాష, సయ్యద్ సాహెబ్, కపిరాజు, పి.నాగేశ్వరరావు, రాము, రాజేష్, కటారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ నిరసన చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

# లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలి

**తాడేపల్లిగూడెం రూరల్:** లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలని మెట్ట ఉప్పరగూడెం సర్పంచ్ మర్లపాటి వీరవెంకటసుబ్బలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామ సచివాలయంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్బలక్ష్మి మాట్లాడారు. మోదుగ గుంట,మెట్ట ఉప్పరగూడెం, ఎల్.అగ్రహారం, కుంచనపల్లి గ్రామాల్లో 85మంది లబ్ధిదారులు ఇంకా ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణం విషయంలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు, మెటీరియల్ అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకుని, ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కే.నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ సచివాలయ కార్యదర్శి గంటి మనీష, డ్వాక్రా సీసీ రూపాదేవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రాజేష్, నవ్య, శ్రీనివాస్, ఈశ్వరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశ దృశ్యం

# మహా పడావ్‌ను జయప్రదం చేయండి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** సీఐటీయూ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు శనివారం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో బి.సోమయ్య అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. తరగతులకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు హాజరైయారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26, 27, 28 తేదీలలో విజయవాడలోని మహా పడావ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను బీజేపీ మోసం చేస్తుందన్నారు. మత ప్రమేయం లేని రాజకీయాలు దేశానికి ఎంతో అవసరమన్నారు. 38 కోట్ల మంది అసంఘటిత కార్మికులకు కేంద్రం సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కె.రాజారామోహన్‌రాయ్, డీఎస్‌వీడీ ప్రసాద్, బి.వాసుదేవర, పీవీ ప్రతాప్, కె.పోసమ్మ, ఎస్.కుమారి, జి.విజయలక్ష్మి, కరెడ్ల రామకృష్ణ, పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

# ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవాలి

**ఉండి:** ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవాలని ఉండి పెదపేట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్ పేరిష్ పాస్టర్ రెవరెండ్ మానుకొండ ప్రసన్నకుమార్ అన్నారు. చర్చ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో బైబిల్ పరీక్షకు 250 మంది హాజరైయ్యారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ధరనిజ, జి.కరుణ, లీలీరోజ్‌కు రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు చొప్పున, మరో ఏడుగురికి రూ.వెయ్యి చొప్పున అందజేమన్నారు. కార్యక్రమంలో ప్రకాశరావు, చిరంజీవిరావు, వాసుపల్లి రవికుమార్, స్త్రీల సమాజం, యూత్, సండె స్కూల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### కలెక్టర్ దృష్టికి నిరుపేదల సమస్య

**ఆకివీడు:** ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణల తొలగింపుతో నిరాశ్రయులైన నిరుపేదలను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిను కోరినట్టు జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వారం రోజుల క్రితం రోడ్డు ఆక్రమణల తొలగింపుతో నిరాశ్రయులైన నిరుపేదలు అక్కడే ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. తాళ్లకోడులో సెంటు భూమి ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హామీ ఇవ్వడంతో కొందరు బాధితులు అంగీకరించారని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో శనివారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు గ్రామానికి వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు పాతపాటి శ్రీనివాసరాజు, గ్రామ అధ్యక్షుడు కఠారి రామకృష్ణ(రాము) ఉన్నారు.

### తమ్ముడిపై అన్న దాడి

**భీమవరం అర్బన్:** భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అన్నదమ్ములు ఆస్థి విషయంలో గొడవ పడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన కొయ్యల గడ్డ ఏడుకొండలు, తన అన్నయ్య సత్యనారాయణకు గతంలో ఆస్థి విషయమై తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కొయ్యల గడ్డ ఏడుకొండలు తలపై తన అన్నయ్య సత్యనారాయణ వదిన సూర్యకాంతం కొట్టి గాయపచడంతో భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఏడుకొండలు ఫిర్యాదు మేరకు ఏఎస్సై డి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.